# కాంగ్రెస్ ఎన్నికల హామీలు మోసమే..

**ప్రజా సంక్షేమంపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధిలేదు..**

**అధికారం కోసం కొమ్ములాటలు..**

**రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి**


మంత్రి సమక్షంలో పార్టీలో చేరుతున్న మహిళలు, గ్రామస్తులు

కొడంగల్, నవంబర్ 8 : ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 6 గ్యారెంటీలు హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డా.పట్నం మహేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చిట్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి ముమ్మరంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ఉనికిని చాటుకునేందుకు 6 గ్యారెంటీలను ఎన్నికల ప్రచారంలో వాడుకొంటుందని ఆరోపించారు. ప్రజా సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీకి కానీ, నాయకులకు కానీ చిత్తశుద్ధి లేదన్నారు. ఈ ఎన్నికల్లో 6 గ్యారెంటీలు తెరపైకి ఎందుకు తెచ్చారని, గత పాలనలో గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమ పథకాలను చూసిన తరువాతే కాంగ్రెస్ కండ్లు తెరిచిందని, కేసీఆర్ పథకాలను కాపీ కొడుతూ వేలం పాట మాదిరిగా గ్యారెంటీలను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఇంత ఇస్తే.. మేము అంతకంటే రెట్టింపు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ వేలం పాట పాడుతుందని, కాంగ్రెస్ మాటలను నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రేవంత్‌రెడ్డి గత 2018 ఎన్నికల్లో కొడంగల్‌లో ప్రాజెక్టు, ఫ్యాక్టరీ, రైలు మార్గం అంటూ ప్రచారం చేయడం జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డికి ఏ ఒక్కటీ సాధ్యం చేసే సత్తాలేదని ప్రజలు గుర్తించి తిరస్కరించడం జరిగిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో కోట్లు పెట్టి పీసీసీ పదవిని కొనుక్కొని, కాంగ్రెస్ టికెట్ల వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణ భవిష్యత్ ఆధారపడి ఉందని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం మంత్రి సమక్షంలో గ్రామంలోని మహిళలు, పెద్దలు, యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్లపల్లి మధుసూదన్‌రెడ్డి, ఖాజా అహ్మద్‌పల్లి సర్పంచ్ అంజప్పతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రావు యాదవ్, కాశప్ప, రమేష్‌బాబు పాల్గొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**ట్రైనీ కలెక్టర్ నారాయణఅమిత్**


సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ నారాయణఅమిత్

వికారాబాద్, నవంబర్ 8 : ఓటు హక్కు కలిగిన వారందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో స్వీప్ ఓటర్ అవగాహన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30న జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా, నిర్భయంగా ఓటు వేయాలని చెప్పారు. కళాశాలలో 100 శాతం మంది విద్యార్థులు ఓటు హక్కు కలిగి ఉన్నందుకు సంతోషదాయకమని, అందరూ తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి మల్లేశం, కళాశాల హెచ్‌వోడీ సునీల్‌కుమార్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన మెడికల్ కళాశాల విద్యార్థులు

# తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు ఉనికి లేదు

**చేవెళ్లలో కాలె యాదయ్య భారీ మెజార్టీతో గెలుపుఖాయం**

**షాబాద్‌లో విలేకరుల సమావేశంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి**

షాబాద్, నవంబర్ 8 : తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు ఉనికి లేదని, ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగురడం ఖాయమని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలోని జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు ఉనికే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరు గ్యారంటీల పేరుతో తిరుగుతున్నారని, ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో ఈ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని, తెలంగాణలో అమలు చేస్తామని చెబితే ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని మహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ సహకారంతో షాబాద్ మండలంలో కంపెనీల ఏర్పాటుకు ఎమ్మెల్యే యాదయ్యతో పాటు కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌రావు, శ్రీరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు శేరిగూడెం వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కె. మధుకర్‌రెడ్డి, బండ్లగూడ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాందేవ్‌యాదవ్ పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం


అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసిన రేడియాలజీ సిబ్బంది

వికారాబాద్, నవంబర్ 8 : అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని బుధవారం రేడియాలజీ కేంద్రంలో వైద్యులు, సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. రేడియాలజీ ద్వారా ఎంతో మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఇందులో భాగంగా సేవలందిస్తున్న రేడియాలజీ వైద్యులు, సిబ్బందిని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం 8న అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం జరుపుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రభాకర్, మౌనిక పాల్గొన్నారు.

# తనిఖీల్లో నగదు పట్టివేత

వికారాబాద్, నవంబర్ 8 : వాహనంలో తరలిస్తున్న రూ.5లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా రూ.5లక్షల నగదును పట్టుకున్నారు. వికారాబాద్ సీఐ శీను తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి తన వాహనంలో హైదరాబాద్ నుంచి వికారాబాద్‌లోని రాజీవ్‌నగర్‌కు వెళ్తుండగా తనిఖీ చేయగా, రూ.5లక్షలు పట్టుబడినట్లు తెలిపారు. సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎలక్షన్‌కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లవద్దన్నారు. తీసుకెళ్లిన డబ్బులకు సరైన ఆధారాలు ఉంటే చూపించాలని తెలిపారు. వాహనాల తనిఖీల్లో ఎస్సైలు అనిత, సత్యనారాయణ రాజు, అవినాష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# నేడు కొడంగల్‌కు కేటీఆర్

**కొడంగల్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేయనున్న మంత్రి కేటీఆర్**

**సాయంత్రం 5 గంటలకు కొడంగల్‌లో రోడ్ షో**

**కేటీఆర్ దత్తతతో మారిన కొడంగల్ నియోజకవర్గ రూపురేఖలు**



వికారాబాద్, నవంబర్ 8,(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నేడు కొడంగల్‌లో పర్యటించనున్నారు. కొడంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేయనున్నారు. నేడు సాయంత్రం 5 గంటలకు కొడంగల్‌లో మంత్రి కేటీఆర్ రోడ్ షో నిర్వహించి మాట్లాడనున్నారు. కొడంగల్‌లో కేటీఆర్ పర్యటన దృష్ట్యా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. దత్తత నియోజకవర్గం కొడంగల్‌కు కేటీఆర్ రానుండడంతో పార్టీ నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.

**మారిన కొడంగల్ ముఖచిత్రం..**

రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దత్తత నియోజకవర్గం కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నది. కొడంగల్ నియోజకవర్గాన్ని మంత్రి కేటీఆర్ దత్తత తీసుకున్న నాటి నుంచి కొడంగల్ నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగింది. రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కొడంగల్‌ను దత్తత తీసుకొని, సిరిసిల్లలా అభివృద్ధిలోకి తీసుకువస్తానని గత ఎన్నికల సమయంలో కొడంగల్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు దత్తత నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన నిధులిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపడంతో కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నది. ప్రభుత్వ హయాంలో రూ.2వేల కోట్లకుపైగా నిధులు మంజూరు చేయించి దత్తత నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు.

**విద్య, వైద్యం సౌకర్యాల కల్పన..**

పట్టణ, పల్లె దవాఖానలు, చెక్‌డ్యాంలు, ప్రభుత్వ దవాఖానలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు, మినీ ట్యాంక్‌బండ్, గురుకుల పాఠశాలలు, బస్ డిపో, బస్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. నియోజకవర్గంలోని కోస్గి ప్రజల కలను సీఎం కేసీఆర్ నెరవేర్చి కోస్గిలో బస్‌డిపోతోపాటు బస్‌స్టేషన్ నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల అభివృద్ధికిగాను అధిక ప్రాధాన్యతనిచ్చి మున్సిపాలిటీల అభివృద్ధికి ఇచ్చిన రూ.80 కోట్ల నిధులతో రెండు మున్సిపాలిటీల్లో అండర్ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు సీసీ రోడ్లు, దుకాణ సముదాయాలు, పార్కులు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి సుందరంగా తీర్చిదిద్దారు. కొడంగల్ మున్సిపాలిటీలో 30 పడకల ప్రభుత్వ దవాఖాన, కోస్గిలో 50 పడకలు, మద్దూరులో 30 పడకల దవాఖానతోపాటు కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి కొడంగల్ ప్రజలకు ఖరీదైన వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నది. నియోజకవర్గంలోని బొంరాసుపేటలో బీసీ గురకుల, కొడంగల్‌లో మైనార్టీ గురుకుల, మద్దూరులో ఎస్సీ గురుకుల పాఠశాలలను మంజూరు చేసి పేద విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యనందిస్తూ ఏటా ఒక్కో విద్యార్థికి రూ.లక్షన్నర ఖర్చు చేస్తుంది. అన్ని కులాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ రూ.4 కోట్లతో కొడంగల్, కోస్గిలో యాదవ భవనాలు, ముదిరాజ్ భవనాలు, అంబేద్కర్ భవన్, రూ.కోటిన్నరతో కొడంగల్‌లో బంజారాభవన్‌ను నిర్మించి గిరిజనులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

**నేడు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**

## నామినేషన్ దాఖలు

కొడంగల్, నవంబర్ 8 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గురువారం కొడంగల్‌కు విచ్చేయనున్నారు. మంత్రి రాక కోసం పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు ప్రాంతంలో హెలీప్యాడ్ నిర్మాణం పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 2గంటలకు మంత్రి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కొడంగల్ చేరుకుంటారు. ఆ తరువాత రోడ్ షో నిర్వహిస్తారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఎన్నికల నామినేషన్ పత్రాన్ని 2 గంటలకు దాఖలు చేయనున్నారు.


హెలిప్యాడ్ ఏర్పాట్ల పనులను పరిశీలిస్తున్న పార్టీ నాయకులు